క్లుప్తంగా

విద్యాభివృద్ధితోనే ప్రగతి



విద్యార్థులకు కిట్‌లు అందజేస్తున్న బద్దుకొండ ప్రదీప్‌నాయుడు, మజ్జి సిరిసహస్ర

పూసపాటిరేగ: విద్యాభివృద్ధితోనే ప్రగతి సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు బద్దుకొండ ప్రదీప్‌నాయుడు, మజ్జి సిరిసహస్ర అన్నారు. మండలంలోని గోవిందపురం, పూసపాటిరేగ, రావాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు పాపినాయుడు, రాజ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

నెల్లిమర్ల రూరల్: ఈ క్రాప్ ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు ఉంటే సిబ్బందికి తెలియజేయాలని ఏఓ పూర్ణిమ కోరారు. మండలంలోని సీతారామునిపేట రైతుభరోసా కేంద్రంలో ఈ–క్రాప్ ముసాయిదా జాబితా సాధారణ తనిఖీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 5వ తేదీ వరకు అన్ని రైతుభరోసా కేంద్రాల్లోనూ జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. ఎలాంటి అభ్యంతరాలున్నా గ్రామ వ్యవసాయ సహాయకుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ అట్టాడ శ్రీనివాస్, ఏఈఓ నాగరాజు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు..

విజయనగరం ఫోర్ట్: రక్తదాతలే ప్రాణదాతలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వైద్యుడు సునీల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో గంట్యాడ మండలం పెణసాం, చినమానపురం గ్రామాలకు చెందిన జయంతి శ్రీనివాసరామశాస్త్రి, కొల్లివీరేంద్ర సత్యనారాయణ జయంతి సందర్భంగా వారి స్నేహితులు శనివారం నిర్వహించిన రక్తదాతన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ఏడాదిలో నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంక్ కౌన్సిలర్ బోని అప్పలనాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ గార రమణ, సిరపురపు సాయికుమార్, పిళ్లా వినయ్‌కుమార్, జయంతి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వితరణ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద నారాయణపట్నంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను ఇండియన్ రెడ్ క్రాస్ ప్రతినిధులు శనివారం పరామర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబాలకు సంస్థ తరఫున రిలీఫ్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు దుర్గా ప్రసాద్, గౌరి, రామకృష్ణ, త్రినాథరావు, పూర్ణచంద్ర, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

సేవలందించడంలోనే సంతృప్తి

విజయనగరం టౌన్: నిరుపేదలకు సేవలందించడంలోనే సంతృప్తి ఉంటుందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు, కేఆర్ హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.కాంతారావుయాదవ్ అన్నారు. యాత కార్పొరేషన్ డైరెక్టర్ అప్పలరాజు ఆధ్వర్యంలో 15వ డివిజన్ అద్దెపల్లివారి వీధిలో బడుగు, బలహీన పేద వర్గాలకు శనివారం ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రెల్ల జానకీరామ్, ట్రస్ట్ మెంబర్స్ ఎం.నవీన్‌దాస్, రామునాయుడు, కిరణ్, అనిల్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ఎంపీపీ కల్యాణి

పూసపాటిరేగ: విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. శనివారం స్థానిక ఓక్‌ల్యాండ్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రయోగాల ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థీ సైన్స్‌పై అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు బి. పాపునాయుడు, రాజ్‌కుమార్, ఓక్‌ల్యాండ్ కరస్పాండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్. రవి, ఎస్సై ఎ. సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ టొంపల సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయండి'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట సచివాలయ పరిధిలో ఈ నెల 5న జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు కోరారు. మండలంలోని సీతారామునిపేట సచివాలయంలో శనివారం వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ శ్రీను పాల్గొన్నారు.

దుప్పాడ... మారింది ఇలా...

- రూ. 74.80 లక్షలతో భవన నిర్మాణాలు
- రూ. 1.5 కోట్లతో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు
- రూ. 40 లక్షల 'నాడు – నేడు' నిధులతో ప్రాథమిక పాఠశాల అభివృద్ధి
- సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి రూ. 20.41 కోట్లు
- పరోక్ష ప్రయోజనం కింద మరో రూ.6.25 కోట్లు

విజయనగరం రూరల్: 'నేను విన్నాను... నేను ఉన్నాను'.. 'మాట తప్పను... మడమ తిప్పను'.. అన్న మాటలను నిజం చేస్తూ ఐదేళ్లలో పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పేదల పక్షపాతిగా నిలిచిన జగనన్న ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేయడంతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. ఏ గ్రామం చూసినా... ఏ పేదింటిని కదిపినా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పాలన కాలమంతా అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధే కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చి పల్లె చెంతనే ప్రజా సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో సంపద కేంద్రాలు సృష్టించి పల్లెలను కొంగొత్తపుంతలు తొక్కించారు. సంక్షేమ పథకాలను అవినీతికి తావులేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తున్న ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుంది. విజయనగరం మండలం దుప్పాడ గ్రామ సచివాలయం పరిధిలో దుప్పాడ, చిల్లపేట గ్రామ పంచాయతీలున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత దుప్పాడ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలకు రూ. 26.66 కోట్ల ఆర్థిక సాయం అందింది. అలాగే అభివృద్ధి కార్యక్రమాలకు రూ. 2.84 కోట్ల నిధులు మంజూరు చేశారు.

భవన నిర్మాణాలు

2019 సార్వత్రిక ఎన్నికల నాటికి చిన్నపాటి భవనంలో ఉన్న గ్రామ సచివాలయ భవనం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ. 30 లక్షలతో కార్పొరేట్ స్థాయిలో నూతన భవనం నిర్మించారు. రైతులకు సేవలందించాలనే ఉద్దేశంతో రూ. 23.94 లక్షలతో ఆర్‌బీకే భవనం.. 24 గంటలు ఇంటింటికీ వైద్యం అందించాలనే ఆశయంతో రూ. 21.80 లక్షలతో వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్ర భవనం నిర్మించారు. వీటి నిర్మాణాలతో సచివాలయం పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ, వైద్య సేవలు గ్రామాల్లోనే అందుబాటులోకి వచ్చాయి.

సుందరంగా సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం

దుప్పాడ గ్రామ సచివాలయం పరిధిలోని రెండు పంచాయతీల్లో ఎటువైపు చూసినా, ఏవీధి చూసినా కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలతో అభివృద్ధి కళ్లకుకట్టినట్లు కనిపిస్తోంది. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో గ్రామ సచివాలయ పరిధిలోని చిల్లపేట – దుప్పాడ రోడ్డు మరమ్మతులకు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారు. అలాగే రెండు గ్రామాల్లో రూ. 1.5 కోట్లతో కాలువలు, ఇంటింటికీ కుళాయి, సీసీ రోడ్లు నిర్మించారు.



రూ. 30 లక్షలతో నిర్మించిన దుప్పాడ గ్రామ సచివాలయం



రూ. 20 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్న దుప్పాడ - చిల్లపేట రోడ్డు



దుప్పాడ వైఎస్సార్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



దుప్పాడలో జగనన్న కాలనీ

పేదల సంక్షేమానికి రూ. 20.41 కోట్లు

ప్రజల సంక్షేమానికి రూ. 20.41 కోట్ల నిధులను అవినీతికి తావులేకుండా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు అందించింది. వైఎస్సార్ పింఛను కానుక ద్వారా రూ. 7.14 కోట్లకు పైగా అందించగా.. వైఎస్సార్ రైతుభరోసా కింద రూ. 2.9 కోట్లు, వైఎస్సార్ చేయూత పథకానికి రూ. 1.58 కోట్లు, జగనన్న అమ్మఒడి పథకానికి రూ. 2.52 కోట్లు, వైఎస్సార్ ఆసరా రూ. 2.54 కోట్లు, ఇతర పథకాలకు కోట్ల రూపాయల నిధులను లబ్ధిదారులకు అందచేసింది. దుప్పాడ, చిల్లపేట గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలలను నాడు – నేడు పథకం కింద ఎంపిక చేసి రూ. 40 లక్షలతో భవన నిర్మాణాలు, మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించారు. అదేవిధంగా పరోక్ష ప్రయోజనాల కింద మరో రూ. 6.25 కోట్లను సంక్షేమ పథకాలకు అందజేశారు.

అభివృద్ధే అజెండా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సత్సంకల్పానికి తోడు స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సహకారంతో ఐదేళ్లలో గ్రామ అభివృద్ధికి కృషి చేశాం. స్థానిక నాయకుల సహకారం తోడై ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం. గ్రామ సచివాలయ పరిధిలోనే సంక్షేమం, అభివృద్ధికి సుమారు రూ. 30 కోట్లు ఖర్చు చేసిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుంది.

– కరుమజ్జి లక్ష్మి, సర్పంచ్, దుప్పాడ గ్రామం

ప్రజల చెంతకే పాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల చెంతకే 540కి పైగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. గ్రామాల్లో రోడ్లు, భవనాల నిర్మాణంతో సంపద సృష్టించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిది.

– బద్రి భాస్కరనాయుడు, ఉప సర్పంచ్, దుప్పాడ గ్రామ పంచాయతీ

కొడుకులా ఆదుకుంటున్నాడు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే పింఛన్ పథకాన్ని పెంచుతూ రూ.3 వేలు అందిస్తున్నారు. అది కూడా గ్రామ వలంటీర్లు పొద్దు పొడవక ముందే ప్రతినెలా ఒకటో తేదీన ఇంటికి తీసుకువచ్చి అందిస్తున్నారు. నా అవసరాలకు పిల్లలపై ఆధారపడకుండా పింఛన్ సొమ్ము పనికొస్తోంది.

– లండ అప్పయ్యమ్మ, పింఛనుదారు, దుప్పాడ

సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం స్థలంతో పాటు ఇంటిని మంజూరు చేశారు. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని సొంతింటి కల నెరవేర్చుకున్నాం. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– చుక్క వరలక్ష్మి, లబ్ధిదారు, దుప్పాడ గ్రామం



దుప్పాడలో నిర్మాణంలో ఉన్న మురుగునీటి కాలువ



దుప్పాడలో రూ. 24 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం



రూ. 22 లక్షలతో దుప్పాడలో నిర్మించిన వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రం



డిజిటల్ విధానంలో విద్యార్థులకు బోధన



నాడు- నేడు నిధులతో అభివృద్ధి చేస్తున్న దుప్పాడ ప్రాథమిక పాఠశాల

శివారు కాలనీలకు తాగునీరు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర ప్రజలకు ఇచ్చిన హామీమేరకు శివారు కాలనీలు, ప్రాంతాలకు సైతం కార్పొరేషన్ ద్వారా కుళాయిలు ఏర్పాటు చేసి మంచినీరు సరఫరా చేస్తున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 42 డివిజన్ కాళీఘాట్ కాలనీలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సూర్యనారాయణ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఆరికతోట తిరుపతిరావు మాట్లాడుతూ.. తమ డివిజన్‌లో ఎన్నడూ లేనంత అభివృద్ధి కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో జరిగిందన్నారు. రానున్న ఎన్నికలలో కోలగట్లను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.



తాగు నీటి కుళాయిలు ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- చంద్రబాబు కేజీ బంగారం ఇస్తామన్నా ప్రజలు నమ్మరు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో గల రిలయన్స్ మార్ట్ భవనం పైఅంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ.. 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పని చేసిన విధంగానే రానున్న ఎన్నికల్లో పార్టీ శ్రేణులంతా కలిసిమెలిసి పని చేయాలని సూచించారు. గత ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేశామని, ఏ ఎన్నికలు జరిగినా ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉందని చెప్పారు. గడిచిన 57 నెలల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు కేజీ బంగారం ఇస్తామని హామీ ఇచ్చినా ప్రజలను నమ్మే పరిస్థితిలో లేరని ఎద్దేవా చేశారు.



పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

నగరంలో 10 జోన్‌లు ఏర్పాటు..

రానున్న ఎన్నికల్లో పార్టీ కార్యకలాపాలు సులువుగా చేసుకునేందుకు, ప్రజలతో పార్టీ శ్రేణులు నిత్యం మమేకమై ఉండేలా విజయనగరం నగరాన్ని 10 జోన్‌లుగా ఏర్పాటు చేయనున్నట్లు కోలగట్ల తెలిపారు. ప్రతి 5 డివిజన్‌లను ఒక జోన్‌గా ఏర్పాటు చేసి వాటికి ఇన్‌చార్జ్‌లను నియమిస్తామన్నారు. ఆయా జోన్ పరిధిలో గల కార్పొరేటర్లు, పార్టీ డివిజన్ స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ విభాగాల నాయకులు ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోలగట్ల శ్రావణి, ముచ్చు లయాయాదవ్, పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సంగంరెడ్డి బంగారునాయుడు, నాయకులు జి.ఈశ్వర్‌కౌశిక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లిమర్ల: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె. రమామోహిని తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఐదు, ఇంటర్‌లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఐదో తరగతిలో ప్రవేశానికి రూ.100, ఇంటర్ ప్రవేశానికి రూ. 250 ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి, ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి అభ్యర్థులకు వచ్చే నెల 27న, ఇంటర్ అభ్యర్థులకు వచ్చే నెల 13న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

మోడల్‌స్కూల్‌లో..

విజయనగరం ఫూల్‌బాగ్: ఫూల్‌బాగ్ ప్రాంతంలోని మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రుక్సానా ఫర్వీన్ తెలిపారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ, ఈనెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 75 పరీక్ష ఫీజు చెల్లించాలని తెలిపారు.

ఘనంగా ఎంవీజీఆర్ కళాశాల వార్షికోత్సవం

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల 26వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి పరిశ్రమల శాఖ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ (విశాఖపట్నం) జె. శివశంకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలానుగుణంగా వచ్చిన ఆధునికతను అందిపుచ్చుకుని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విజయవంతంగా ప్రయాణిస్తోందన్నారు. ప్లేస్‌మెంట్‌తోనే ఆలోచనలను ఆపేయవద్దని విద్యార్థులకు సూచించారు. వినూత్న ఆలోచనలు, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగితే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థీ 20 నుంచి 40 సంవత్సరాల మధ్య లక్ష్యాలను సాధించేందుకు పరితపించాలని సూచించారు. గౌరవ అతిథి, పయనీర్ అల్యూమినియం కంపెనీ డైరెక్టర్ ఎల్ఎస్ రావు మాట్లాడుతూ.. నేను కూడా మహారాజా వారి కళాశాలలో చదువుకున్నానని చెప్పడానికి గర్వపడుతున్నానని చెప్పారు. కళాశాల అకడమిక్ టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బంగారు, వెండి పతకాలు అందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- గో సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ

పూసపాటిరేగ: మండలంలోని అల్లాడపాలెం సంతలో మౌలిక సదుపాయాలు కల్పించాలని గో సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. మండలంలోని అల్లాడపాలెం సంతలో మానటరింగ్ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీఓ 23 , హైకోర్టు ఆదేశాల మేరకు సంతలో సదుపాయాలు కల్పించాలన్నారు. మంచినీటి కుండీలు, షెడ్డులు, సీసీ కెమెరాలు, ర్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం గోమాత చిత్రపటంతో కూడిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ అల్లాడ రమేష్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పీవీవీ మాధురి, ఏఎస్సై సురేష్, పశువైద్యాధికారి సుధీర్‌కుమార్, ఏఎంసీ కార్యదర్శి ఆర్. సతీష్, తదితరులు పాల్గొన్నారు.



అల్లాడపాలెం సంతలో మౌలిక సదుపాయాలు పరిశీలిస్తున్న మానటరింగ్ కమిటీ సభ్యులు

బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే జగనన్న ధ్యేయం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం రూరల్: బడుగు, బలహీనవర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా ఇళ్లు కట్టుకుని ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న పేద ప్రజలకు జగనన్న పూర్తి హక్కులతో హక్కు పత్రాలను అందిస్తున్నారని చెప్పారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న 112 మంది లబ్ధిదారులకు విజయనగరం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం హక్కుపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల స్థలాలను కేటాయించిందన్నారు. అలాగే పట్టణ పరిధిలోని గాజులరేగ, అయ్యకోనేరుగట్టు, కేఎల్ పురం, రాజీవ్‌నగర్ కాలనీ, శాంతినగర్ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉన్న పేదలకు పూర్తి హక్కులతో పత్రాలను అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రత్నం, కార్పొరేటర్లు కంటుభుక్త తవిటిరాజు, పొట్నూరు శ్రీనివాసరావు, కనకల నాగవల్లి, పట్టా ఆదిలక్ష్మి, హెచ్‌డీటీ కొట్నాన శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు ఇంటి హక్కుపత్రాలు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి